క్లుప్తంగా

రేపు నాగులాపల్లిలో మెగా వైద్య శిబిరం

కొత్తపల్లి: మండలంలోని నాగులాపల్లిలో ఆదివారం ఉచిత సూపర్ స్పెషాలిటీ మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు కాకినాడ జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు తెలిపారు. నాగులాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటలకు వైద్య శిబిరం ప్రారంభమవుతుందని చెప్పారు. అన్ని వ్యాధులకు సంబంధించిన వైద్య నిపుణులు పాల్గొని రోగులకు ఉచితంగా పరీక్షలు చేస్తారన్నారు. మండల ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మరిడమ్మకు స్వర్ణపుష్పార్చన



పెద్దాపురం: మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం 108 బంగారు పుష్పాలతో అష్టోత్తర నామార్చన నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు ఆధ్వర్యంలో వేద పండితులు చిట్టెం హరి గోపాలశర్మ పర్యవేక్షణలో ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

20న పోలేరమ్మతల్లి తీర్థం



అమీనాబాద్‌లో వేంచేసిన పోలేరమ్మ తల్లి

కొత్తపల్లి: మండలంలోని అమీనాబాద్ గ్రామ దేవత పోలేరమ్మతల్లి తీర్థం ఈ నెల 20న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యుడు, గ్రామ సర్పంచ్ నక్కా మణికంఠబాబు శుక్రవారం తెలిపారు. 19వ తేదీ రాత్రికి పోలేరమ్మతల్లి జాతరను అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఈ మేరకు ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరిస్తున్నారు. అమ్మవారి తీర్థాన్ని పురస్కరించుకుని పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

సకాలంలో పథకాలు అందజేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీలలిత

సామర్లకోట: ఆయుష్మాన్ భారత్ ఈకేవైసీ సమయం పూర్తి అవుతున్నా చంద్రంపాలెంలోని వలంటీర్లు సచివాలయ సిబ్బంది సకాలంలో స్పందించడం లేదని ఎంపీడీఓ డి.శ్రీలలిత అన్నారు. శుక్రవారం చంద్రంపాలెం, పనసపాడు గ్రామాల్లో సచివాలయ కార్యదర్శులకు నిర్వహించి సమీక్షలో ఆమె పాల్గొన్నారు. సకాలంలో ఈకేవైసీ పూర్తి చేసి ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పిఠాపురం: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు శుక్రవారం గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన దెయ్యాల పెద అప్పారావు గురువారం రాత్రి గొల్లప్రోలులో రోడ్డుపై నడిచి వెళుతుండగా వేగంగా వచ్చిన మోటారు సైకిల్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పెదఅప్పారావుకు తీవ్ర గాయాలవ్వడంతో పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గొల్లప్రోలు ఎస్సై వినయ్‌ప్రతాప్ తెలిపారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

జగ్గంపేట: జిల్లాలోని నిరుద్యోగ యువతకు పీఎంకేవీవై పథకంలో భాగంగా అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సులో మూడు నెలల పాటు ఇస్తున్నట్లు జగ్గంపేట ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ రాధా రామకృష్ణన్ శుక్రవారం తెలిపారు. 15 నుంచి 45 ఏళ్ల లోపు యువతి, యువకులు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 14వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 95020 89936 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

బకాయిలపై బాధ్యత మరచి..

- రూ.16 లక్షల మేర పేరుకుపోయిన పన్నులు
- వసూలు చేయడంలో సిబ్బంది నిర్లక్ష్యం
- గతంలో జీతాల కోసం ఎంతో శ్రద్ధ.. నేడు ప్రభుత్వం ఇస్తుండడంతో అశ్రద్ధ
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ



సామర్లకోట స్టేషన్ సెంటర్‌లోని దుకాణ సముదాయం

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలో దుకాణాల ద్వారా రూ.16,34,445 వరకు అద్దె బకాయిలు పేరుకుపోయాయి. ఇందుకు కారణం మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని బకాయిదారులు అంటున్నారు. గతంలో మున్సిపాలిటీకి వచ్చే ఆదాయం నుంచే సిబ్బందికి జీతాలు ఇచ్చేవారు. అందువల్ల సిబ్బందే చొరవ తీసుకుని పన్నులు, అద్దెలు వసూలు చేసేవారు. ప్రస్తుతం ప్రభుత్వమే వారికి జీతాలు చెల్లించడంతో పన్ను వసూళ్లు, దుకాణాల అద్దె వసూళ్లపై శ్రద్ధ తగ్గిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయమై మున్సిపల్ మేనేజర్ అచ్యుతరాజును వివరణ కోరగా స్థానిక స్టేషన్ సెంటర్‌లోని 30 దుకాణాల నుంచి రూ.9,89,580, నూకాలమ్మ ఆలయం వద్ద ఉన్న షాపుల నుంచి రూ.50,619 బకాయి ఉన్నట్లు తెలిపారు. బల్లమార్కెట్ షాపుల నుంచి రూ.1,09,890, తిలక్ చౌక్ వద్ద షాపుల నుంచి రూ.2,99,284, మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న షాపుల నుంచి రూ.51,451, సంత మార్కెట్ వద్ద దుకాణాలకు సంబంధించి రూ.61,591, కొత్తూరు మార్కెట్ షాపుల నుంచి రూ.69,030 బకాయి ఉన్నట్లు ఆయన వివరించారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలో 13,144 ఇళ్లు ఉండగా పన్ను డిమాండ్ రూ.3.27 కోట్లు ఉండగా రూ. 2.24 కోట్లు మాత్రమే వసూలు చేశారు. కుళాయి పన్ను రూ.1.98 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా 42.25 లక్షలు మాత్రమే వసూలు చేశారు.

నిత్యం పర్యవేక్షిస్తున్నాం



ప్రతి రోజు మున్సిపాలిటీ పరిధిలోని 15 సచివాలయాకు చెందిన అడ్మిన్లతో పన్నుల వసూళ్లపై పర్యవేక్షిస్తున్నాం. పన్నుల వసూళ్ల కోసం ప్రతి వార్డులో స్వయంగా పర్యటిస్తున్నా. మార్చి నెలాఖరు నాటికి మున్సిపల్ షాపుల నుంచి 100 శాతం బకాయిలు వసూలు చేస్తాం. బకాయిలు చెల్లించకపోతే చట్టపరమైన చర్యలు ఉంటాయి. అపరాధ రుసుం విధిస్తాం.

– పూడి రవిబాబు, రెవెన్యూ అధికారి, సామర్లకోట

మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు



మున్సిపాలిటీ పరిధిలోని వివిధ శాఖల అధికారులు బాధ్యతా రాహిత్యంగా పని చేస్తు న్నారు. ప్రతీ రోజు ఇంజినీరింగ్ అధికారులు వాటర్ ప్లాంట్‌ను, పైపులైన్లను పరిశీలించాల్సి ఉండగా నీటి ఎద్దడి వచ్చే వరకు స్పందించడం లేదు. ఇంటి పన్నులు, షాపింగ్ కాంప్లెక్స్‌ల అద్దెల వసూళ్లలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సచివాలయ కార్యదర్శుల ద్వారా పర్యవేక్షిస్తే ఆదాయం పెరుగుతుంది.

– నేతల హరిబాబు, కౌన్సిలర్, సామర్లకోట

ప్రతి ఒక్కరికీ ఆల్బెండజోల్ వేయాలి

ఏడీఎంహెచ్ఓ డాక్టర్ సరిత



ఆల్బెండజోల్ ట్యాబెట్లను పంపిణీ చేస్తున్న ఏడీఎంహెచ్ఓ సరిత



గొల్లప్రోలులో వైద్య సిబ్బందికి ఆల్బెండజోల్ మాత్రలు అందజేస్తున్న ఎంపీడీఓ శర్మ

పెద్దాపురం: ప్రతి విద్యార్థికి ఆల్బెండజోల్ ట్యాబ్లెట్ వేయించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఏడీఎంహెచ్ఓ డాక్టర్ పి.సరిత అన్నారు. ఈ నెల 14న నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండల పరిధిలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు ఎంపీడీఓ హిమమహేశ్వరితో కలసి అందజేశారు. విద్యార్థులచే ట్యాబ్లెట్ వేయించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ట్యాబ్లెట్లను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు అందజేశారు. కాండ్రకోట పీహెచ్‌సీ డాక్టర్ ధనలక్ష్మి, వైద్య సిబ్బంది, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నులి పురుగు నివారణ మాత్రలు వేసుకోవాలి

సామర్లకోట: పిల్లలు, పెద్దలు నులి పురుగుల మాత్రలు తప్పని సరిగా వేసుకోవాలని వేట్లపాలెం పీహెచ్‌సీ డాక్టర్ హిమవతి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఏఎన్ఎంలు, ఆశా వర్కర్ల సమావేశంలో ఆమె పాల్గొన్నారు. నులి పురుగుల వల్ల పిల్లలో రక్తం పెరుగుదల నిలిచిపోతుందన్నారు. రెండేళ్ల పిల్లల నుంచి అందరూ ఈ మాత్రలు వేసుకొవాలన్నారు. ఎంపీడీఓ డి.శ్రీలలిత మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలోని విద్యార్థులకు ఈ మాత్రలను ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఇచ్చి వారిచే మింగించాలన్నారు. ఎంపీడీఓ బొబ్బరాడ సత్తిబాబు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నిడదవోలు సురేష్‌చౌదరి, మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణకు చర్యలు

పిఠాపురం: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని, పిల్లలకు భోజనం తరువాత ఆల్బెండాజోల్ మాత్రలు వేసేలా చర్యలు చేపట్టాలని గొల్లప్రోలు ఎంపీడీఓ డీఎల్ఎస్ శర్మ అధికారులకు సూచించారు. గొల్లప్రోలు ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం నేషనల్ డీవార్మింగ్ డే కార్యక్రమాన్ని ప్రారంభించారు. గొల్లప్రోలు నగర పంచాయతీ, మండల పరిధిలో వైద్య సిబ్బంది, అధికారులతో నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీపై సమీక్షించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎస్.వెంకటేశ్వర్లు, వైద్యులు డి.శ్యామల, కె.తులసికుమారి తదితరులు పాల్గొన్నారు.

సీతారామస్వామికి స్వర్ణాభరణాల సమర్పణ



చేబ్రోలులో స్వామికి బంగారు గొలుసులు అందజేస్తున్న రామాచార్యులు కుటుంబ సభ్యులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలులో వేంచేసిన సీతారామస్వామి వారి ఆలయానికి భక్తులు శుక్రవారం బంగారు గొలుసులు సమర్పించారు. ఆలయ అర్చకుడు రేజేటి రామాచార్యులు తన భార్య రేజేటి లక్ష్మి పేరున రూ.3.50 లక్షల విలువైన 62 గ్రాముల మూడు బంగారు గొలుసులు, రెండు లాకెట్లను సీతా రామస్వామి, సీతాదేవి, లక్ష్మణస్వామిలకు సమర్పించారు. ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త దామెర దివాకర్ చేతుల మీదుగా వీటిని అందజేశారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి వాటిని స్వామి, అమ్మవార్లకు అలంకరించారు. ఆలయ ఈఓ టీవీ సూర్యనారాయణ, జెడ్పీటీసీ వులవకాయల నాగ లోవరాజు పాల్గొన్నారు.

సాగునీటి ఎద్దడి రానీయొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సత్తిబాబు

సామర్లకోట: మండల పరిధిలోని రైతులకు సాగు నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అన్నారు. శుక్రవారం మండల పరిషత్తు కార్యాలయంలో జరిగిన మండల వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గోదావరి కాలువలో నీటి మట్టం తక్కువగా ఉండటంతో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు కృషితో ఏలేరు ప్రాజెక్టు నీరు విడుదల చేసినట్టు తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని పంట కాలువలకు నీరు సక్రమంగా అందేలా ఇరిగేషన్ అధికారులు చూడాలన్నారు. ప్రస్తుతం వరి పంట పొట్ట దశలో ఉండటంతో నీటి అవసరం ఎక్కువగా ఉంటుందని చెప్పారు. ఈ మేరకు అధికారులు రైతుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నిడదవోలు సురేష్‌చౌదరి, ఏఓ ఐ.సత్య, ఏఈఓ ఎంవీ సతీష్ పాల్గొన్నారు. వీకే రాయపురంలో రైతులకు సాగునీరు అందడం లేదని రైతు సంఘ నాయకులు వెలమర్తి బుల్లిరాజు, ఇంటి వెంకట్రావు ఆందోళన వ్యక్తం చేశారు.

రిటైరై.. తిరిగి విధుల్లోకి..

అన్నవరం: గత ఏడాది కాలంలో రిటైరైన ఏడుగురు ఉద్యోగులు హైకోర్టు ఉత్తర్వుల మేరకు తిరిగి అన్నవరం దేవస్థానంలో విధుల్లో చేరారు. వివరాలివీ.. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయస్సును 2022 జనవరి 1 నుంచి 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే దేవదాయ శాఖలో అసిస్టెంట్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, జాయింట్ కమిషనర్ తదితర ఉద్యోగులకు మాత్రమే దీనిని వర్తింపజేశారు. ప్రముఖ దేవాలయాల్లోని సిబ్బందికి అమలు కాలేదు. అన్నవరం దేవస్థానంలో గడచిన ఏడాది కాలంలో 60 ఏళ్లు నిండిన 15 మంది ఉద్యోగ విరమణ చేశారు. వీరిలో ఏడుగురు హైకోర్టును ఆశ్రయించారు. పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచే జీఓను తమకు కూడా వర్తింపజేయాలని న్యాయస్థానాన్ని కోరారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు వారికి అనుకూలంగా తీర్పు చెప్పింది. దీంతో ఒక డీఈ, ఒక సూపరింటెండెంట్, ఐదుగురు రికార్డు అసిస్టెంట్, జూనియర్, సీనియర్ అసిస్టెంట్ స్థాయి ఉద్యోగులు శుక్రవారం తిరిగి విధుల్లో చేరారు.

ప్రయాణం.. ప్రమాదకరం



ఆటోలో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న యువకులు

కొత్తపల్లి: ప్రాణాలను సైతం లెక్క చేయకుండా యువకులు వివిధ వాహనాల్లో నిర్లక్ష్యంగా ప్రయాణం చేస్తున్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆటోవాలాలు ఆటోల్లో 10 నుంచి 15 మందిని ఎక్కించుకుని మితిమీరిన వేగంతో నడుపుతున్నారు. ఆటో వెనుక డోర్‌పై సైతం ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. యువకులు ఆటోకు ఒక వైపున వేలాడుతూ ప్రయాణాలు సాగిస్తున్నారు. ముఖ్యంగా ఉప్పాడ–కోనపాపపేట, కాకినాడ–ఉప్పాడ బీచ్‌రోడ్డులో మత్స్యకారులు ఆటోల్లో పరిమితికి మించి ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటున్న ఆటోలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం



వనదుర్గ అమ్మవారికి చండీహోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించారు. ఆలయ పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు రమేష్ ఘనపాఠి, కోట శ్రీనివాస్, చిట్టెం వాసు, నగేష్, కొంపెల్ల సత్యనారాయణ మూర్తి, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం జరిపారు. 20 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు లక్షకుంకుమార్చన

సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ఆలయ ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలో అర్చకులు లక్ష కుంకుమార్చన నిర్వహించారు. కొండ దిగువన తొలిపాంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు ప్రయాగ రాంబాబు ఆధ్వర్యంలో లక్ష కుంకుమార్చన నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

దివ్యాంగులకు వినికిడి యంత్రాల పంపిణీ



దివ్యాంగులకు వినికిడి యంత్రాలు అందజేస్తున్న యూనియన్ బ్యాంకు అధికారి వరప్రసాద్

తుని రూరల్: స్థానిక భవిత కేంద్రంలోని దివ్యాంగులకు యూనియన్ బ్యాంకు రీజినల్ కార్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం వినికిడి యంత్రాలను పంపిణీ చేశారు. స్థానిక భవిత కేంద్రంలో మండల విద్యాశాఖ అధికారి పరవాడ గీతాదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు ఫీల్డ్ జనరల్ మేనేజర్ కేఎస్‌డీఎస్ వరప్రసాద్ రూ.26 వేల విలువ చేసే వినికిడి యంత్రాలు, స్కూల్ బ్యాగులను అందజేశారు. వినికిడి సమస్యలు ఉన్న చిన్నారులకు సౌండ్ థెరిపీ శిక్షణ ఇస్తామని భవిత కేంద్రం ఉపాధ్యాయులు తెలిపారు. యూనియన్ బ్యాంకు రీజనల్ కార్యాలయం అందించిన వినికిడి యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాకినాడ రీజినల్ హెడ్ కేఎస్‌వీ చిన్నారావు, స్థానిక బ్యాంకు మేనేజరు ఎస్.వెంకట్, తుని మహిళా జూనియర్ కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు కలిదిండి సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

భద్రత పాటిస్తేనే ప్రమాదాల నివారణ

- ఫ్యాక్టరీల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ
- ఎన్ఎఫ్‌సీఎల్‌లో 52వ భద్రతా వారోత్సవాలు



భద్రతా పరికరాలను పరిశీలిస్తున్న డీఐ రాధాకృష్ణ

కాకినాడ రూరల్: భద్రతా సూత్రాలను పాటించడం ద్వారానే కర్మాగారాల్లో ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ డి.రాధాకృష్ణ పేర్కొన్నారు. స్థానిక నాగార్జున ఫెర్టిలైజర్స్ కర్మాగారంలో 52వ భద్రతా వారోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. కర్మాగారంలోని పలు విభాగాలు పరిశీలించి, రక్షణ చర్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాలు నివారించడానికి ప్లాంట్ డిజైన్ దశ నుంచే విధాన రూపకల్పన, వ్యక్తి గత రక్షణ పరికరాల వినియోగంలో ఎన్ఎఫ్‌సీఎల్ తగు జాగ్రత్తలు పాటిస్తుందన్నారు. భద్రతా వారోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి, ప్రమాద రహితమే లక్ష్యంగా ప్రతి ఉద్యోగి పనిచేయాలని సూచించారు. జిల్లాలో ఇటీవల నిర్వహించిన మాక్ డ్రిల్‌లో పాల్గొన్న అధికారులను ఆయన అభినందించారు. ఎన్ఎఫ్‌సీఎల్ సీనియర్ జీఎం పి.చంద్రమోహన్ మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతికతో ప్లాంట్ భద్రతకు పెద్ద పీట వేస్తున్నామన్నారు. మెయింటెనెన్స్ హెడ్ పి.విజయకుమార్ మాట్లాడుతూ ప్లాంట్‌లో పనిచేసే ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పని ఒత్తిడిని జయించేందుకు వివిధ పోటీలు నిర్వహించినట్టు తెలిపారు. ఆ పోటీల్లో విజేతలకు డీఐ రాధాకృష్ణ బహుమతులు అందజేశారు. ఫైర్ అండ్ సేఫ్టీ హెడ్ మహంతి, సిబ్బంది రాజు, గంగాసింగ్, శ్రీనివాసరావు, రమాదేవి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలులో ఆర్ఆర్ చిత్ర యూనిట్ సందడి



గొల్లప్రోలులో ఆర్ఆర్ చిత్ర యూనిట్

పిఠాపురం: గొల్లప్రోలు గోవింద మహల్ థియేటర్ వద్ద శుక్రవారం ఆర్ఆర్ చిత్ర యూనిట్ సందడి చేసింది. మొగలి రాజా, దియారాజ్, కోటిపల్లి బుజ్జి, చర్ల గీత, చర్ల గణేష్ తారాగణంగా తెరకెక్కిన ఈ సినిమా మంచి కుటుంబ కథా చిత్రంగా విజయం సాధిస్తుందని దర్శకుడు వీఎస్‌వీవీ మణికంఠ తెలిపారు. శ్రీసత్యదేవాయ ఫిల్మ్ బేనర్‌పై నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం విడుదల కావడంతో చిత్ర యూనిట్‌ను గొల్లప్రోలులో అభిమానులు సత్కరించారు. పలువురు సినీ అభిమానులు పాల్గొన్నారు.

బ్యాగ్‌ను అందజేసిన ఆటో డ్రైవర్



యజమానికి బ్యాగ్‌ను అందజేసిన వేణు

సామర్లకోట: ఆటోలో ప్రయాణికులు మరచిపోయిన బ్యాగ్‌ను తిరిగి ప్రయాణికులకు అందజేసి ఆటో డ్రైవరు వేణు తన నిజాయతీని నిరూపించుకున్నారు. శుక్రవారం పిఠాపురం నుంచి దంపతులను సామర్లకోట తీసుకువచ్చి తిరిగి వెళుతున్న సమయంలో ఆటోలో ఉన్న బ్యాగ్‌ను డ్రైవర్ వేణు గమనించారు. వెంటనే ఆటోను తిరిగి సామర్లకోట వెళ్లారు. అప్పటికే తాము మరచిపోయిన బ్యాగ్ కోసం లబోదిబో మంటూ ఆటో కోసం వెదకుతున్న వారి వద్దకు వెళ్లి ఆ బ్యాగ్‌ను అందజేశాడు. బ్యాగ్‌లో బంగారు నల్లపూసల దండ, ఒక నెక్లెస్, కొంత నగదు ఉన్నాయి. క్షేమం గా తమ బ్యాగ్ చేతికి రావడంతో ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేసి ఆటో డ్రైవరుకు కృతజ్ఞతలు తెలిపారు.

దివ్యాంగురాలికి చేయూత



పెద్దిపాలెంలో వృద్ధురాలికి బియ్యం, నిత్యావసరాలు అందజేస్తున్న యువకులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పెద్దిపాలెం శెట్టిబలిజపేటలో దివ్యాంగురాలికి శుక్రవారం గ్రామ యువకులు చేయూతనందించారు. స్థానిక పీడీవై హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో దివ్యాంగురాలు రాళ్ల వరలక్ష్మికి బియ్యం, నిత్యావసర వస్తువులు, కూరగాయలతో పాటు ఆర్థిక సహాయం అందజేశారు. దివ్యాంగురాలికి అండగా నిలిచిన యువకులను గ్రామ పెద్దలు అభినందించారు. గ్రామంలో ఎవరికి ఏ ఆపద వచ్చినా తాము అండగా ఉంటామని హెల్పింగ్ హ్యాండ్స్ యువకులు తెలిపారు.

మహిళలకు అన్ని రంగాల్లోనూ సముచిత స్థానం

తొండంగి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాల్లోనూ సముచిత స్థానం కల్పిస్తోందని జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వైఎస్సార్ క్రాంతిపథం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మలత మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం వైఎస్సార్ చేయూత, ఆసరా వంటి పథకాలతో పాటు అమ్మఒడి, పేదలందరికీ ఇళ్లపట్టాలు వంటి అనేక సంక్షేమ పథకాలను మహిళలే కేంద్ర బిందువుగా అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ పసపులేటి సతీష్, ఐకేపీ ఏపీఎం సత్తిబాబు ఆధ్వర్యంలో జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలతను ఘనంగా సన్మానించారు. అనంతరం మండల మహిళా సమాఖ్య సంఘం అధ్యక్షురాలు అడ్డాల సూర్యకాంతం, జిల్లా ఉత్తమ సీసీ అవార్డు గ్రహీత సత్యవేణి, ఎంపీపీ అంగుహూరి అరుణ్‌కుమార్ సతీమణి సుశీల, ఉత్తమ అకౌంటెంట్‌గా ఎంపికైన శ్యామలను సన్మానించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎస్.సత్యప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, మండల మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.